
# వృసోత్కర్షి

వీరపనే వీణావాణి



అది శీతకాలం. వయస్సుడిగిపోయిన వృద్ధుడిలా ఉన్నాడు పడమటి కొండల్లోకి జారిపోతున్న సూర్యుడు. ఎంతో సేపటినుంచి ఏడ్చిన ఒంటరి నేత్రంలా ఎర్రగా ఉంది పడమటి ఆకాశం. వేదనాభారంతో క్రుంగిన హృదయాన్ని లాలించే ఓదార్పులా చల్లగా వీస్తూ ఉంది ఈదురుగాలి.

ఆ ఇంటి వరండాలో బెంచీపైన కూర్చుని, పడమటి ఆకాశంవేపు పరిశీలనగా చూస్తూ ఉంది రేణుకాదేవి. ఆమె జీవితంలో అరవై వసంతాలు గడిచిపోయాయి. తన వర్తమాన వృద్ధ జీవితానికీ, పడమటి ఆకాశంలోని సూర్యగోళానికీ కొంత సామ్యం ఉన్నట్టు అనిపించింది రేణుకాదేవికి.

మరి కొన్ని నిముషాల్లో ఈ సూర్యగోళం అస్తమిస్తుంది. వెలుతురు అంతమౌతుంది. అమావాస్య చీకట్లు అలుముకుంటాయి. సూర్యగోళం లాగే నిష్క్రమించడానికి తనూ సిద్ధంగానే ఉంది. కానీ తన నిష్క్రమణతో నిజానికి ఈ ఇంట్లో ఏ వెలుతురూ అంతం కాదు. ఏ చీకటీ అలుముకోదు.

చలిగాలి మరింత ఉధృతంగా వీచింది. ఇంట్లో కెళ్ళి బీరువాలో ఉన్న పాత శాలువాను తీసి ఒంటినిండా కప్పుకుంటే బాగుండు ననిపించింది రేణుకాదేవికి. అంతలోనే ఆ పాత శాలువా నాలుగు రోజుల క్రితమే కొద్దిగా చిరిగిపోయిన విషయం కూడా ఆమెకి గుర్తుకొచ్చింది.

అది ఇప్పటికే చాలా చోట్ల చిరిగిపోయింది. అయినా తను ఎంతో ఓపిక తెచ్చుకుని దానికి మాసికలు వేయగలిగింది.

ఆ శాలువాకైతే తను మాసికలు వేయగలిగింది కానీ, ఈ ఇంట్లో చిరిగిపోయిన అనుబంధాలకూ, ఆత్మీయతలకూ తను మాసికలు వేయలేకపోయింది. ఏ సూత్రంతో, ఏ సూదితో ఈ తెగిపోయిన, చిరిగిపోయిన అనుబంధాలకు కుట్లూ, మాసికలూ వేయాలో అది తనకు పూర్తిగా అవగతం కావడంలేదు.

ఆ వరండాలోంచి లేచి హాల్లోకి నడిచింది రేణుకాదేవి. గోడకి వేలాడుతున్న కాలండర్‌కి గుచ్చిన సూదిని తీసుకుంది. అక్కడే టేబుల్ మీద పడి ఉన్న దారపు ఉండని కూడా అందుకుని, మళ్ళీ వరండాలోకి వచ్చి కూర్చుని సూదిలోకి



దారాన్ని ఎక్కించే ప్రయత్నం చేసిం దామె.

సూదిని పట్టుకున్న ఆమె ఎడమ చేయి, దారాన్ని పట్టుకున్న కుడి చేయి... రెండూ గాలికి కదిలిన చిగురుటాకుల్లా కంపించసాగాయి. పైగా ఆమెకి దృష్టి కూడా కొంత మందగించడంవల్ల ఆ సూదిలోకి దారాన్ని సూటిగా ఎక్కించలేక చాలాసేపు అవస్థలు పడవలసివచ్చింది.

"నాయనమ్మా ! ఏం చేస్తున్నావే?" అంటూ సరిగ్గా అప్పుడే వీధిలోంచి వరండాలో కొచ్చాడు పదముడేళ్ళ రమణ. తన నాయనమ్మ ఏ పనిలో నిమగ్నమైపోయి ఉందో తెలుసుకునేందుకు ఓ క్షణం కంటే ఎక్కువ పట్టలేదు రమణకు.

"నాయనమ్మా ! నీకు సరిగ్గా అగుపించడంలేదే. సూది ఓ వేపుంటే నువ్ దారాన్ని ఇంకోవేపు పోనిస్తున్నావు. అంత వక్రమార్గంలో పోనిస్తే... ఆ సూదిలోకి దారం ఎలా వెళ్ళగలదు? ఇలా ఇవ్వు నా చేతికి" అంటూ రేణుకాదేవి చేతుల్లోంచి ఆ సూదినీ, దారాన్నీ అందుకున్నాడు రమణ.

దృష్టి మాంద్యం. ఈ మానవ జాతికే ఇవాళ దృష్టి మాంద్యం ఏర్పడింది. అది, స్వార్థం వల్ల సంక్రమించిన మాంద్యం. అందుకే చెప్పే మాటలకూ, చేతలకూ పొత్తు కుదరడంలేదు.


ఆదర్శాలకూ, ఆచరణకూ సఖ్యత సంభవించడంలేదు. ఈ మాంద్యం వల్ల అవి వక్రమార్గాన వెళ్తున్నాయి.

ఈ వక్రమార్గాన్ని కప్పిపుచ్చుకునేందుకు మనిషి పగటి వేషం కూడా వేస్తున్నాడు. ఇందుకు నిదర్శనం తన కొడుకు రామానుజమే. మూర్తీభవించిన స్వార్థం మీద 'మానవత' అనే ముసుగును తగిలించుకుని, ఈ ఊళ్ళో గొప్ప మానవతావాదిగా చలామణీ అయిపోతున్నాడు రామానుజం.

"నాయనమ్మా ! ఇదిగో సూదీ దారం" అంటూ రేణుకాదేవికి ఇచ్చేసి వెళ్ళిపోయాడు రమణ. ఆమె వాటిని అక్కడే బెంచిమీద ఓ చోట గుర్తుగా పెట్టి... శాలువా కోసం ఇంట్లోకి వెళ్ళింది.

బీరువా తెరిచి చూసింది రేణుకాదేవి. ఆమె కనుబొమలు ఒక్కసారిగా ముడిపడ్డాయి. గబగబా ఆ బీరువా మొత్తం గాలించసాగింది.

మొదటిసారిగా ప్రసవించిన ఒక స్త్రీ కళ్ళు తెరిచి చూడగా తన పక్కన బిడ్డ అగుపించనట్లు రేణుకాదేవి కళ్ళలో అంతులేని అలజడి...




ఆందోళన. ఎంత గాలించినా బీరువాలో తన పాత శాలువా అగుపించలే దామెకు.

"భానుమతీ ! భానుమతీ !"

"ఏమి టా కేకలు?" అంటూ వంట గదిలోంచి బాణంలా దూసుకొచ్చిన భానుమతి ఆమె వేపు ఏవగింపుగా చూసింది.

"ఈ ఇంట్లో ఒకరిచేత కేకలు వేయించుకునే స్థితిలో తప్ప నేను ఒకరిమీద కేకలు వెయ్యగల స్థితిలో లేను తల్లీ !" అంటూ కోడలివేపు చూసింది రేణుకాదేవి.

"అంటే ఏమిటి? తమరి మీద నే నేదో కేకలు వేస్తూ, ఓ కోడలిగ్గా అధికారాన్ని చూపెడుతున్నాననే కదా అర్థం?" అంటూ విరుచుకుపడింది భానుమతి.

"అమ్మా ! నా శాలువాని నువ్వేమైనా తీశావా అని కేవలం ఆ ఒక్క మాటను మాత్రం అడగడం కోసమే నిన్ను పిలిచాను." సౌమ్యంగా అంది రేణుకాదేవి.

"ఎందుకూ పనికిమాలిన ఆ పాత శాలువా?, చుట్టుపక్కల ఉన్న వాళ్ళంతా చూస్తూ ఉంటే - వరండాలో తగలడి సూదీ దారంతో కుట్టుకోవడానికా?"

"పాతబడిపోయినా వదులుకోలేనివి జీవితంలో కొన్ని ఉంటాయి. అయినా నేను శాలువాని కుట్టుకుంటే నీ కొచ్చిన అభ్యంతరం ఏమిటి తల్లీ?"

"మా పరువు తియ్యడాని కిదో మార్గం. బట్టలు చిరిగిపోయినా తమరికి కొత్తవి కొనివ్వలేదని మా గురించి చుట్టుపక్కల వాళ్ళంతా చెడుగా అనుకోవాలి."

"భానుమతీ !"

"అవు నత్తయ్యా ! తమరి ఉద్దేశం నాకు బాగా తెలుసు." చురచురా చూసింది భానుమతి.

"ఎదుటి మనిషి ఉద్దేశ మేమిటో నీకు తెలియనపుడు నీకు తెలిసిన దాన్ని ఎదుటి మనిషికి అంటగట్టడం పొరబాటు భానుమతీ !" రేణుకాదేవి అంది.

"నాకు తెలియనిది ఏమీ లేదు లెండి. చూసే వాళ్ళంత మీ మీద సానుభూతి చూపెట్టాలి. మాపైన అసహ్యం వెళ్ళగక్కాలి. అందుకే ఆ శాలువాను అందరూ చూసేలా ఉతికి ఆరేస్తుంటారు కూడా" అంది మండిపడుతూ భానుమతి.

"భానుమతీ ! ఆ శాలువాను అప్పుడప్పుడు నేను నా స్వహస్తాలతో ఉతుక్కుంటున్నదీ, కుట్టుకుంటున్నదీ నిజమే. కానీ ఆ శాలువాను తప్ప తక్కిన నా బట్టల్ని నే నెప్పుడైనా ఉతుక్కోవడం, కుట్టుకోవడం గానీ నువ్ చూశావా?"

"ఆ శాలువాను మాత్రం ఎందుకు అలా ప్రత్యేకంగా ఉతకడం? పనిమనిషికి పడేస్తే ఆ పనేదో అదే చేసి పెట్టదూ?" అంది భానుమతి

"నీ కొడుక్కి నీ చేతుల్తో ప్రతి రోజూ రెండు పూటలా స్నానం చేయిస్తా వెందుకు? పనిమనిషికి అప్పగిస్తే ఆ పనేదో అదే చేసిపెట్టదూ?"

భానుమతికి బదులు చెప్పకుండా తలెత్తి రేణుకాదేవి వేపు అదో రకంగా చూసింది.

"మమకారం ఒక్క మనిషికే పరిమితం కాదు. ఒక్కోసారి జడపదార్థాలలో కూడా అది ముడిపడి ఉంటుంది. జడపదార్థాల మీద కూడా మమకారం పెంచుకోవడానికి ఒకానొక కారణం, దాని వెను కో కథ ఉంటాయి."

"నాకు మమకారాల గురించి అంతగా తెలియదులెండి." వ్యంగ్యంగా అంది భానుమతి.

"అది తెలిస్తే తల్లీ కొడుకుల మధ్య కూడా సరిహద్దుల రేఖల్ని గీసి సర్వే రాళ్ళ నెందుకు పాతిపెడతావు? నీ జీవితం కేవలం ఒక కోడలి స్థాయితోనే స్తంభించిపోదు. నీకూ ఒక కోడలు వస్తుంది. నువ్వూ అత్తయ్య వవుతావు."

"అవును. అవుతాను. అయితే ఏమిటి?" అమిత అసహనంగా చూసింది భానుమతి.

"ఆ వచ్చే కోడలు నీకూ, నీ కొడుక్కీ మధ్య సరిహద్దు రేఖల్ని గీసినప్పుడు... ఒక మాతృహృదయ ఘోష ఎలా ఉంటుందో అప్పు డర్థమౌతుంది. అద్దం ముందు నిలబడినప్పుడే మన వికృతరూపం మనకు తెలిసివచ్చేది."

"చూడండి. మీ కొడుకును నా కొంగుకి నేనేం ముడేసుకుని తిప్పడంలేదు. మీ కొడుకు మిమ్మల్ని ఓ తల్లిగా ప్రేమగా చూడకపోతే అది నా తప్పు కాదు. కత్తి మొద్దుబారితే పిడిమీద కస్సెర చేసి లాభం లేదు."

"ఆ కత్తిని పట్టుకున్నది ఇప్పుడు నీ చెయ్యే తల్లీ. నీ భర్తని కొంగున ముడేసుకుని ఈ ఇంట్లో న న్నెంత నీచంగా చూస్తున్నారో నేను చెప్పనవసరంలేదు. ఓసారి వీథిలోకి వెళ్ళి ఎవర్నయినా అడిగి చూడు."

"తమరు పనిగట్టుకుని మా గురించి ఈ విధి మొత్తం ప్రచారం చేశారు కదా. ఇప్పుడు జనం మా గురించి ఎందుకు చెడుగా చెప్పుకోరు? అయినా కుక్కలు ఉచితానుచితాలు గుర్తించి మొరుగుతాయా ఏమిటి?"

"తప్పకుండా మొరుగుతాయి. దొంగల్ని పసికట్టే కుక్కలు కూడా ఉంటాయి. అయినా దుర్గంధం గురించి ఎవరూ పనిగట్టుకుని ప్రచారం చెయ్యనవసరంలేదు. సులభంగా అదే గాల్లో వ్యాపించగలదు" అంది రేణుకాదేవి.

"ఈ కొంపలో ఇంత కంపును సృష్టించిం దెవరు? తమరే కదూ. కొడుకు దాంపత్య సుఖజీవితాన్ని చూసి సహించలేని సంకుచిత స్వభావం గల మీరు కొడుకును కనడం ఎందుకు? పైగా పెళ్ళి చెయ్యడ మెందుకు?"

"భానుమతీ ! పిండాన్ని కడుపులో మోస్తూ, పుట్టబోయే మగబిడ్డకి సంబంధించిన వరకట్నపు ఆశను కూడా అదే కడుపుతో మోసిన నువ్వు... నా పుత్రవాత్సల్యాని కిప్పుడు స్వార్థాన్నీ సంకుచితత్వాన్నీ అంటగడుతున్నావా?"

"ఏమిటండీ ఏమిటి మీరు వాగేది? మీరు అత్తగారైతే కావచ్చు. కానీ హద్దులు మీరి నోటికొచ్చినట్లు వాగకండి. ఎవరి హద్దుల్ని వారు గుర్తుంచుకుంటే మర్యాదగా ఉంటుంది." హెచ్చరించింది భానుమతి.

"నా అరవై ఏళ్ళ వ్యక్తిత్వాన్నీ నేను నిర్వహించిన ముప్పయ్ అయిదేళ్ళ పంతులమ్మ వృత్తినీ ఇలా నీతో మాట్లాడి ఒక్క నిమిషంలో కించపరుచుకోలేను. సరే నా శాలువాను నువ్వు గానీ తీశావా?" రేణుకాదేవి అడిగింది.

"అవును. తీశాను. ఆ దరిద్రగొట్టు శాలువా ఈ కొంపలో ఎందుకని, మొన్న పాతబట్టలకి స్టీల్ సామాను ఇచ్చేవా డొస్తే నా పాత చీరలతో పాటు ఆ శాలువాను కూడా వాడికి పారేసి, రెండు స్టీల్ గ్లాసుల్ని..."

"ఎంత పని చేశావు భానుమతీ !" అంటూ కొయ్యబారిపోయింది రేణుకాదేవి. ఆమెవేపు నిర్లక్ష్యంగా ఓ చూపు చూసి, వంట గదివేపు తిరిగింది భానుమతి.

"హుఁ... చనుబాలను సైతం విక్రయించుకునే వ్యాపార దృష్టికి మనను పొరల్లో దాగిన మమకారం ఎలా గోచరిస్తుంది? ఈ ఇంట్లో ఏది దరిద్రపుగొట్టుదో నాకు తెలును" అంటూ కోడలివేపు ఛీత్కారంతో చూసి - ఇంట్లోంచి వేగంగా వరండాలోకి వెళ్ళిపోయింది రేణుకాదేవి.

** ** **

రెండ్రోజులు గడిచిపోయాయి. ఆ రోజు ఆదివారం. తెలిసిన వాళ్ళింటి కెళ్ళి వాళ్ళని పలకరించి తిరిగి ఇంటికి వస్తూంది రేణుకాదేవి. తను ఇంటికి దగ్గరయ్యేకొద్దీ ఆ ఇంట్లోంచి ఆమెకి కేకలు గట్టిగా వినిపించసాగాయి.

వెంటనే గబగబా నడవసాగిం దామె. వరండాలోకి అడుగు పెట్టి లోపలి దృశ్యాన్ని చూసేసరికి రేణుకాదేవికి గుండె తరుక్కుపోయింది. బొల్లిగద్ద కాళ్ళ నడుమ ఇరుక్కుపోయిన కోడిపిల్లలా ఆమె హృదయం గిలగిలా కొట్టుకుంది.

ఆ హాల్లో నేలమీద పడి అటూ ఇటూ పొర్లుతూ... రెక్కలు నరికేసిన పక్షిలా గింజుకుంటూ ఉన్నాడు రమణ. వాడి ఏడుపుతో, ఆర్తనాదాలతో ఆ ఇల్లు ప్రతిధ్వనించిపోతోంది.

రామానుజం ఉగ్రుడైపోయి ఉన్నాడు.

రామానుజం చేతిలోని బెత్తం రమణ ఒంటిమీద తాండవం చేస్తూ ఉంది. అక్కడే నిలబడ్డ భానుమతి ఆ దారుణాన్ని ఆపడానికి బదులు 'తగిలించండి వెధవకి' అంటూ భర్తను రెచ్చగొడుతూ ఉంది.

"ఒరేయ్ రామానుజం ! ఏమిట్రా ఇది? ఎందుకురా పసివాడిని ఇలా గొడ్డును బాదినట్టు బాదుతున్నావ్?" అంటూ గబగబా అక్కడి కొచ్చిన రేణుకాదేవి రమణకు అడ్డంగా నిలబడి రామానుజం చేతిలోంచి బెత్తం లాక్కుంది.

"నాన్నమ్మా ! వీళ్ళు నన్ను చంపేస్తారే" అంటూ బిగ్గరగా ఏడుస్తూ, రేణుకాదేవి కాళ్ళకి గట్టిగా బల్లిలా... అతుక్కుపోయాడు రమణ.

భయంతో వాడు ఆపాదమస్తకం కంపించిపోవడం గమనించింది రేణుకాదేవి.

"ఒరేయ్ రామానుజం ! తల్లి కొడితే బిడ్డ తండ్రిని ఆశ్రయిస్తాడు. తండ్రి కొడితే తల్లిని ఆశ్రయిస్తాడు. కానీ ఇదేమిట్రా? మీ రిద్దరూ కలిసి వీడిని చావగొడుతున్నారు? ఒరేయ్, తమ బిడ్డల్ని పులులు తింటాయి. కానీ మనుమలు తినరు."

"వాడు చేసిన వెధవ పనికి వాడిని కొట్టడం కాదే, నరికి పోగులు పెట్టాలి. ఒళ్ళు చీరేయ్యాలి. నువ్వు అడ్డులే" అంటూ ఆవేశంతో ముందుకు రాబోయాడు రామానుజం.

రేణుకాదేవి అతన్ని వారించింది.

"మీరు నరికి పోగులు పెట్టదగినంత ఘోరమైన నేరం వీడేం చేశాడురా?"

"ఏం చేశాడో ఓసారి అటు చూడు" అంటూ చేత్తో టేబుల్ వేపు చూపెట్టాడు రామానుజం.

తల తిప్పి టేబుల్ వేపు చూపుల్ని సారించింది రేణుకాదేవి. ఆ టేబుల్ దగ్గర నేలమీద గాజుపెంకులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అవి కింద పడి పగిలిపోయిన ఒక తాజ్‌మహల్ బొమ్మ తాలూకు పెంకులు.


# కేవలం 2 రూ॥ 50 పైసలతో మీఅబ్బాయి / అమ్మాయి భవిష్యత్తుముడిపడి వుంది. నమ్మలేక పోతున్నారా?

ఈ ఏడాది మీ అబ్బాయి / అమ్మాయి
ఏడవ తరగతి చదువుతుంటే
పై మాటలు అక్షర సత్యం

ఏడవ తరగతి విద్యార్థుల కోసం

నాయుని కృష్ణమూర్తి సంపాదకత్వంలో నెలనెలా వెలువడే

## మాబడి

పత్రిక కొని చదివితే
మీ చిరంజీవికి చదువు పట్ల
ఆసక్తి అధికం కావచ్చు
దాని ప్రభావం భవిష్యత్తు మీద ఎంతో ఉండడానికి అవకాశం ఉంది.
సంశయించకండి.....

**మీచిరంజీవి భవిష్యత్తుతో పోలిస్తే**
**2 రూ॥ 50 పైసలు విలువైనవి కావు**

నేడే కొని చదివించండి

**విడిప్రతి వెల : 2 రూ. 50 పైసలు**
**సంవత్సర చందా : 25 రూ.**

ప్రతి చందాదారుడికీ

**విజ్ఞాన దీపిక అనే పుస్తకం ఉచితం. ఉచిత పుస్తకం జూలై 30వ తేదీ లోపల చందా పంపినవారికి మాత్రమే!**

**MABADI**
**CHOWDEPALLE - 517 257 CHITTOOR Dt. A.P.**

"సుమారు పదమూడేళ్ళయింది దాన్ని కొని. ఇప్పు డలాంటి బొమ్మ మళ్ళీ దొరుకుతుందా? టేబుల్‌పైన పెడితే ఎంత షోగా ఉండేది? ఇన్నాళ్ళకి వీడు దాన్ని పొట్టన బెట్టుకున్నాడు వెధవ రాస్కెల్" అంది భానుమతి.

"నాన్నమ్మా ! దాన్ని నేను కావాలని పగలగొట్టలేదు. టేబుల్‌మీద నేను పెన్ కోసం వెతుక్కుంటూ ఉంటే పొరపాటుగా నా చేయి తగిలి ఆ తాజ్‌మహల్ కింద పడి పగిలిపోయింది." ఏడుస్తూ చెప్పాడు రమణ.

"పొరపాటుగా కింద పడిపోయిందని వీ డిలా మొత్తుకుంటూ ఉంటే, ఇక చావబాదడ మెందుకు? వీడిని ఇలా చావబాదినంతమాత్రాన ముక్కలైపోయిన ఆ తాజ్‌మహల్ మళ్ళీ అతుక్కుంటుందా? కేవలం... ఒక గాజుబొమ్మకోసం కన్నబిడ్డని ఇలా చావగొడతా రా?" అంది రేణుకాదేవి.

"ఎంత సులభంగా తీసిపారేస్తున్నారండీ అత్తయ్యగారూ ! అది గాజుబొమ్మ కావచ్చు. కానీ అదంటే నాకు ప్రాణం. పదమూడేళ్ళ క్రితం ఆగ్రాకు టూర్ వెళ్ళినప్పుడు ఆయన తన ప్రేమకి చిహ్నంగా నా కోసం కొని తెచ్చారు" అంది భానుమతి.

"ఓహో అలాగా?"

"అయినా భార్యా భర్తల మధ్య గల ప్రేమానురాగాలూ, ఆ తీపిగుర్తులూ, వాటి విలువలూ... ఇవన్నీ మీ కెలా బోధపడతాయిలెండి. పైగా ఈ వయస్సులో..." రేణుకాదేవి వేపు చూసి వ్యంగ్యంగా అంది భానుమతి.

"చూడమ్మా ! నువ్వు కేవలం ఓ మొగ్గవి. నేను వండిపోయి రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఒక పుష్పాన్ని. వండిన పుష్పానికి పరిమళాల గురించి ఏ మొగ్గా పాఠం చెప్పనవసరంలేదు. ఇప్పుడు నువ్వు పీలుస్తున్నది ఒకప్పుడు నేను దాంపత్యంతో సృష్టించిన పరిమళాన్నే. ఆ విషయాన్ని నువ్వు గుర్తుంచుకుంటే బావుంటుంది" అంది రేణుకాదేవి.

"టేబుల్ మీద తాజ్‌మహా లున్నది నీకు అగుపించలేదట్రా? నీ కళ్ళకి పొరలు కమ్మాయా ఏమిటి? ముక్కలు ముక్కలు చేశావు కదరా డర్టీ ఫెలో. ఒరేయ్ ! నిన్ను... నిన్ను..." అంటూ పళ్ళు కొరుకుతూ మళ్ళీ ముందుకు వెళ్ళబోయాడు రామానుజం.

"ఒరేయ్ రామానుజం ! ఒక్క నిముషం ఆగరా. రమణ చేసింది నేరమే. నేను కాదనను. కనుక వీడిని నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు బాదుకోవచ్చు. కానీ ఈ పని చేసేముందు నువ్వు నీ భార్యని కూడా ఇలాగే ఈ బెత్తంతో చావబాదగలవేమో ఓసారి ఆలోచించి చెప్పు" - అంది రేణుకాదేవి.

"ఏమిటీ ! భానుమతిని చావబాదడమా?" ఆశ్చర్యపోతూ తల్లివేపు చూశాడు రామానుజం.

"అవును."

"ఎందుకురా?"

"భార్యా, కొడుకూ ఒకే నేరం చేసినప్పుడు... ఇద్దరికీ ఒకే న్యాయం వర్తించాలి. అందుకు."

"అంటే??"

"ఒరేయ్ రామానుజం ! నీ కొడుకు చాలా పసివాడు. పైగా పొరపాటుగా నేరం చేశాడు. కానీ నీ భార్య పసిపిల్ల కాదు. పొరపాటుగా ఇప్పుడు నీ కొడుకు ఏం చేశాడో... అదే నేరాన్ని అయిదు రోజుల క్రితం నీ భార్య కావాలనే తెలిసి తెలిసీ చేసింది."

"ఏమిటది?"

"నా పాత శాలువాని స్టీల్ సామాను ఇచ్చే వాడికి దారపోసిందిరా భానుమతి."

"అ దో పెద్ద నేరమా?"

"ను వ్విలా అంటావని నాకు తెలుసురా. ఒరేయ్ ! నీ భార్యకి నువ్వు తెచ్చి ఇచ్చిన ఆ తాజ్‌మహలంటే ఎంతో... మీ నాన్న తన ప్రేమ కానుకగా ఇచ్చి పోయిన ఆ శాలువా కూడా నాకూ అంతేరా." రేణుకాదేవి అంది.

రామానుజం బదులు చెప్పలేదు.

"ఒరేయ్ ! కావాలంటే రెండే రోజుల్లో నువ్వు ఆగ్రాకి వెళ్ళి, సరిగ్గా ఇప్పుడు పగిలిపోయిన తాజ్‌మహల్ బొమ్మలాంటి మరో బొమ్మని నీ స్వహస్తాలతో కొని నీ భార్యకి నీ స్వహస్తాలతో ప్రేమ కానుకగా ఇవ్వగలవు. కానీ... కానీ... రెండు జన్మలెత్తినా... నువ్వు కానీ, నీ భార్య కానీ మళ్ళీ అలాంటి శాలువాను నా భర్త చేత కొనిపించలేరు. ఆయన స్వహస్తాలతో నాకు ప్రేమ కానుకగా ఇప్పించనూ లేరు."

రామానుజం తల కిందికి వాలింది.

"ఒరేయ్ ! మీ నాన్న పోయేనాటికి ఆయన నాకు మిగిల్చిన స్మృతిచిహ్నాలు మూడు. ఒకటి తను కట్టిన తాళి. రెండు తనకు పుట్టిన నువ్వు.



మూడవది తను ప్రేమతో తెచ్చి ఇచ్చిన ఆ శాలువా. ఈ తీపిగుర్తులు కూడా నాకు దక్కలేదు. మొదటి గుర్తును మతం చెరిపేసింది. రెండోదాన్ని స్వార్థం మింగేసింది. ఇక మూడోదాన్ని ఒక కిరాతకి తుడిచేసింది" అంది రేణుకాదేవి.

రామానుజం వెంటనే తల కొద్దిగా తిప్పి భానుమతి వేపు చూశాడు.

"ఒరేయ్ ! నీ భార్య చేసింది 'తప్పు' అని నువ్వనుకుంటే భానుమతిని శిక్షించు. లేనిపక్షంలో నిర్దోషి అయిన ఈ పసివాడిని దారుణంగా హింసించినందుకు ఈ బెత్తంతో నిన్ను నువ్వే బాగా శిక్షించుకో."

రామానుజం పెదవి విప్పలేదు.

"ను వ్వేమీ చెయ్యలేవని నాకు ముందే తెలుసురా. నువ్వు చెయ్యగలిగింది భార్య మాటలు విని నీ తల్లిని నీచంగా చూడడమే. ఒరేయ్ అభ్యుదయవాదీ ! మాతృ హృదయాన్నే గాయపరిచే నీ నవీన అభ్యుదయానికి చరిత్ర ఉండదురా. అన్ని వాదాలకంటే మానవతావాదం ఒక్కటే చరిత్ర పుటల్లో అగ్రస్థానం వహిస్తుందని గుర్తుంచుకోరా."

"అమ్మా !"

"ఏరా? కోపం వచ్చిందా? ఒరేయ్ ! పరశురాముడు తన తల్లి తలను గండ్రగొడ్డలితో నరికాడు. కానీ తల్లిని బతికించుకోగలననే విశ్వాసం దృఢంగా ఉండబట్టే... ఆ పరశురాముడు రేణుకాదేవి తలను నరకగలిగాడు. కానీ నువ్వు ఈ రేణుకాదేవి తలను రోజూ కొద్ది కొద్దిగా నరికేస్తున్నావు - నీ భార్య ప్రేమని బ్రతికించుకోగలననే నమ్మకంతో."

రామానుజం ముఖం కందిపోయింది.

"ముప్ఫయ్ అయిదేళ్ళు తెలుగు టీచర్‌గా పని చేసిన నేను ఎంతోమంది విద్యార్థుల్ని ఆదర్శ మానవులుగా తీర్చిదిద్దగలిగాను. ఏం లాభం? నా కొడుకును మాత్రం ఒక మనిషిగా తీర్చిదిద్దలేకపోయాను. అవును... అందరికీ శుభం పలికే బల్లి ఆఖరికి పడి చచ్చేది కుడితిలోనే."

ఆ మాట అనేసి ఇంట్లోంచి గబగబా వరండాలోకి వెళ్ళిపోయింది రేణుకాదేవి. రమణ కూడా తన బుక్స్ పట్టుకుని వరండాలోకి వెళ్ళి, నాయనమ్మ దగ్గర కూర్చుని చదువుకోసాగాడు. భానుమతి, రామానుజాల దగ్గరి కంటే ఆ పసివాడికి రేణుకాదేవి దగ్గరే చనువు ఎక్కువ.

"నాయనమ్మా ! నా కో చిన్న సందేహం వచ్చిపడిందే." రేణుకాదేవి వేపు చూశాడు రమణ.

"ఏమిట్రా అది?"

"మరి. మన తెలుగులోని అచ్చుల్లో ఋ, ౠ తరువాత 'ఌ ౡ' అనే అచ్చులు కూడా ఉన్నాయిగా."

"ఎందుకు లేవు? ఉన్నాయి."

"అయితే ఌకారం వచ్చే పదం ఏదైనా ఉదాహరణకి ఒకటి చెప్పు చూద్దాం."

"చంపేశావిరా మనవడా ! నా ముప్ఫయ్ అయిదేళ్ళ సర్వీసులో ఇలాంటి ఇబ్బందికరమైన ప్రశ్నని ఎవరూ అడగలేదురా." నవ్వింది రేణుకాదేవి.

"అయితే అలాంటి పదాలు లేవా?"

"ఉండొచ్చు. అయినా గుర్తుకు రావడంలేదు" అంటూ ఆలోచించసాగిం దామె.

"అన్నట్టు... ఇకారం ప్రయోగింపబడిన ఓ పద్యం గుర్తుకొచ్చింది రమణా !"

"ఏమిటి నాయనమ్మా అది?"

"పింగళి సూరన అనే కవి రచించిన 'రాఘవ పాండవీయం' అనే కావ్యంలో ప్రారంభంలో 'లోకత్రాణరతిన్' అనే ఓ పద్యం ఉంది. అందులో 'భాషా కఌప్త' అనే పదంలో కవి ఌకారాన్ని ప్రయోగించాడు."

"కఌప్త అంటే ఏమిటి?"

"అంటే తొడిగిన అని అర్థం. నేడు భాషలో ఈ ఌకారం వ్యస్తాక్షరి."

"ఏమిటి? వ్యస్తాక్షరా... అంటే?"

"అంటే... భాషలో వాడుకలో లేకుండా భాషలోంచి వేరుపడిపోయిన అక్షర మన్న మాట."

"అయితే భాషలోంచి వేరుపడిపోయిన పదాలు కూడా ఏవైనా ఉన్నాయా నాయనమ్మా?" రమణ సరిగ్గా అలా అడుగుతున్నప్పుడే వరండాలోకి వచ్చాడు రామానుజం.

"మంచి ప్రశ్నే అడిగావురా మనవడా ! దీనికి సమాధానం ముఖ్యంగా పెద్దలు వినాలి. ఇది, వ్యాపార వ్యవస్థ. వర్తక దృష్టి గల ప్రతివాడి భాషలోంచీ, వాడి గుండెల్లోంచీ 'అమ్మ' అనే పదం వేరుపడిపోయిందిరా. వర్తక సమాజంలో దీనికి స్థానం లేకుండా పోయింది. అవును... అ, మ్మ... ఇవి రెండూ ఇవేళ వ్యస్తాక్షరాలే." రేణుకాదేవి అలా అంటుంటే వెనుదిరిగి గబగబా వీధిలోకి వెళ్ళిపోయాడు రామానుజం. ◆